ఆంధ్రపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు: 1938–1972.

November 9, 1986

నవంబరు 9, 1986

దిషణా ధురంధరుడు దిగవల్లి

నిరాడంబరమైన వేషం. విశిత పరిశీలనాలోచనా పూరితములైన లోచనములు. మృదుమధుర మనోహరములైన పలుకులు జాతీయము దేశీయమునైన భావగరిమ- పరిశ్రమ సుందరిమ. మధురము హృద్యమూనైన రచనా పాటవము. గాంధేయ పథానుసరణ నిండుకున్న మధురార్ద్ర హృదయులు శ్రీ దిగవల్లి వేంకట శివరావుగారు.

ఈయన సత్యాన్వేషణ. దేశాభిమానం. సత్యనిష్ఠ. ధర్మనిష్ఠ. జాత్యభిమానం అడుగడుగునా తన నిజజీవితమునను రచనల యందునూ కనపరచిన మహోన్నత చారిత్రకుడు. జాతీయోద్యమానికాయనిచ్చిన చేయూత-సలిపిన నిస్వార్థకృషి యావదాంధ్రదేశమేనాటికి విస్మరించజాలనిది పశ్చిమ కృష్ణా జిలా కాంగ్రెస్ కమిటీ ప్రచారశాఖాధిపతులుగా నుండి సత్యాగ్రహ చరిత్ర. నిర్భాగ్య భారతము బార్డోలి సత్యాగ్రహ విజయము బ్రిటీషు వస్తుబహిష్కారము మున్నగు పొత్తములు రచించి జాతీయోద్యమదీప్తికి ఎంతగానో దోహదమిచ్చినాడు

కృష్ణామండలమునందెందరు దేశసేవకులనో ఉత్తేజపరిచి. ఉత్సాహపరిచి జాతీయోద్యమమునకురికించిన ఘనవీయుడు దిగవల్లివారు. సాహిత్య పరులను కూడా ఎంతగానో ప్రేరేపించిన ప్రజ్ఞామయుడు శివరావుగారు

శ్రీ శివరావుగారికి నాగేశ్వరరావు పంతులుగారితో సన్నిహిత పరిచయముండేది భారతిని ప్రారంభించిన రోజులలో నాగేశ్వరరావు పంతులుగారు స్వయంగా కలుసుకొని భారతికి వ్యాసాలు వ్రాసిఇమ్మని కోరారు అప్పటినుండి శివరావుగారికి ఉచితముగా భారతి పంపేవారు

తరువాత శ్రీశంభు ప్రసాద్‌గారికి కూడా అతి సన్నిహిత పరిచయం ఏర్పడింది. ఆంధ్ర వార పత్రికకు దిన పత్రికకు భారతికి శివరావుగారు బండ్లతో వ్యాసాలు తోలారు సుమారు పది సంవత్సరాలు శివరావుగారి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి వ్యాసాలు లేకుండా ఏ పత్రిక అచ్చుకాలేదని చెప్పుట అతిశయోక్తి కాదు. శ్రీ శంభుప్రసాద్‌గారు ఫలానా విషయమును గూర్చి వ్యాసం వ్రాయమని



వ్రాసిన లేఖలు వందలలో వుంటాయి. చివరకు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారికి. శ్రీ దిగవల్లి శివరావుగారికి చెరో వెయ్యినూట పదార్లు ఇచ్చి సమ్మానించారు శంభుప్రసాద్‌గారు. చివరకు శంభుప్రసాద్ గారు శివరావు గారి అన్నగారి కుమారునితో వియ్యం పొంది సన్నిహిత బంధువులయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశానికి ఏమీ చేయలేదు కాంగ్రెసు ప్రభుత్వాలని ఒక విమర్శక వ్యాసం వ్రాసి శివరావుగారు ఆంధ్రపత్రికకు పంపితే ఆ వ్యాసం అచ్చుకాక తిరిగి రావడంతో ఆనాటి నుండి ఆంధ్రపత్రికకు వ్యాసాలు పంపటం మానుకున్నారు శివరావుగారు.

శివరావుగారు ఎంతటి రచయితో- అంతకుమించిన విమర్శకుడు. వివేకి విజ్ఞుడే కాక అవజ్ఞత నెప్పుడూ కనపర్చనివాడు. సద్విమర్శనే తప్ప దుర్విమర్శ నెన్నడూ చేయని వ్యక్తి. చిన్నవీ. పెద్దవీ కలసి అర్ధశతంపైగా పొత్తములు. వందలకొలది వ్యాసములు రచించిన దిట్ట.

ఆంధ్రులకు భారత మందించిన కవిత్రయ మెంతటి పూజనీయులో- విజయవాటికలో జాతీయోద్యమానికి కార్యకర్తల నుద్యమింపచేసిన వ్యక్తులు దిగవల్లి వేంకటశివరావుగారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1966 సెప్టెంబరు 22వ తేదీన విజయవాడలో ఘనంగా సమ్మానించినది. ఆ సభలో ప్రఖ్యాతదేశ సేవకులు, పశ్చిమకృష్ణా కాంగ్రెస్ నాయకులు శాసన సభ్యులు కాకాని వెంకటరత్నంగారు ప్రసంగిస్తూ మూడు దశాబ్దాల క్రితం కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ వాలంటీర్లకు శ్రీ శివరావుగారు గురుదేవులవంటివారని. వారు బసవరాజు అప్పారావువంటి కవులను తయారు జేసి. వెనక వుండి జాతీయోద్యమాన్ని నడిపారని. కనుపడని త్యాగాలు జేసి దేశ భక్తులను ఉత్తేజపరచి ప్రోత్సహించిన 'మహనీయుడని ప్రస్తుతించారు. విశ్వనాథ్ వారు తనకు ఎన్నో విధముల స్ఫూర్తినిచ్చినవ్యక్తి శివరావు గారని పేర్కొన్నారు. ఆంధ్రకేసరి ప్రకాశం గారికి డా॥ పట్టాభిగారికి అయ్యదేవర కాళేశ్వరరావు, బులుసు సాంబమూర్తి కొండా వెంకటప్పయ్య ఉన్నవ లక్ష్మీనారాయణ. స్వామీ సీతారాంగార్లకు శివరావు గారంటే అమిత గౌరవం. ఆప్యాయత చూపేవారు శ్రీ దిగవల్లి వేంకట శివరావుగారు 1908లో మార్చి 14న కాకినాడలో వెంకటరత్నం సూర్యమాణిక్యాంబగార్లకు జన్మించినారు. కందుకూరి వీరేశలింగం హైస్కూలు రాజమండ్రిలో చదివారు కందుకూరి నెరిగి అభిమానించినవారు. చెన్నపట్నంలో లా చదివి 1922 నుండి విజయవాడలో న్యాయవాదిగా నుండి 1947లో విజయవాడలో న్యాయవాద సంఘాధ్యక్షులైనారు. అరువదేండ్లు పైగా అనేకములైన చారిత్రక గ్రంథములు నిష్పాక్షిక. నిర్మల హృదయంతో. నిర్మోహపు మతితో. సత్య. ధర్మ నిష్ఠలతో కూడినట్టి రచన లెన్నో చేసి ఖ్యాతికెక్కినారు. ఆంధ్రుల త్యాగమయ జీవితాన్ని తలచుకొని - అందుకు తగిన స్థానము చేకూరనందుకు వ్యథపడతారు. చరిత్రకారుడిగా జీవితం ప్రారంభించాను చరిత్రకారునిగానే జీవిస్తాను. మేజర్ బి. డి. బసు. ఎడ్వర్డు థాంప్సన్ ప్రభృతుల రచనలు నన్ను జాతీయ దృక్పథంతో చారిత్రక వ్యాసాలు వ్రాయడానికి ప్రేరేపించాయి. స్వాతంత్ర్యోద్యమంలో తమ సర్వస్వం సమర్పించిన మహా త్యాగులతో పోల్చుకుంటే నేను సామాన్య కార్యకర్తను మాత్రమే. జాతీయ దృక్పథంతో కూర్చిన సమగ్రమైన నిఘంటువు గాని. వ్రాసిన చరిత్రగాని లేవు. కనీసం ఆంధ్రప్రదేశ్ చరిత్రను జాతీయతా దృక్పథతో పరిశీలించి వ్రాయవలసిన ఆవశ్యకత వున్నది.. అని ఆనాడు 1966న ప్రభుత్వము తమకు చేసిన సన్మానసభలో ప్రసంగిస్తూ శివరావుగారన్నారు. ఇదే ఆయన దృక్పథం.

—డా॥ ప్రకాశచంద్ర శతపథి